క్లుప్తంగా

29 నుంచి కోదండరాముడి బ్రహ్మోత్సవాలు

చంద్రగిరి: స్థానిక కోదండరామస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 4 వరకు నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. 29న అంకురార్పణ, 30న ధ్వజారోహణం నిర్వహించనున్నారు.

నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టనున్నారు. బ్రహ్మోత్సవాలకు ముందు వచ్చే మంగళవారం రోజున కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో ఆలయ గోడలు, స్వామివారికి వినియోగించే ఆభరణాలు, ఇతర వస్తువులను నీటితో శుద్ధి చేస్తారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న చిన్నారులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి వరదరాజనగర్‌లోని భాష్యం పాఠశాలలో సోమవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఇందులో ప్రొఫెసర్ ఎం.హమీరా ఖామమ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. యూకేజీ, 5వ తరగతి విద్యార్థులు పట్టాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల జోనల్ ఇన్‌చార్జ్ లక్ష్మణ్, ప్రిన్సిపాల్ బాలాజీ, లిటిల్ చాంప్స్ ఇన్‌చార్జ్ సుధాకుమారి పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిస కావొద్దు



మాట్లాడుతున్న సీఐ ఓబులేశు

చంద్రగిరి: విద్యార్థి దశలో వ్యసనాలకు బానిసలుగా మారితే భవిష్యత్తు అంధకారంగా మారుతుందని సీఐ ఓబులేశు తెలిపారు. మండలంలోని అగరాల సమీపంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం మాదకద్రవ్యాల వినియోగం–అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో సీఐ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ చట్టపరంగా ర్యాగింగ్ నేరమన్నారు. ప్రిన్సిపాల్ సుకుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. ఎస్ఐ వంశీధర్, హెచ్‌వోడీలు నరసింహారెడ్డి, భక్తవత్సలం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

ఘనంగా పిచ్చుకల దినోత్సవం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న క్యూరేటర్ సెల్వం

తిరుపతి అలిపిరి: శ్రీ వెంకటేశ్వర జూపార్కులో సోమవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. క్యూరేటర్ సెల్వం, తిరుపతి సైన్స్ సెంటర్ ఎడ్యుకేటర్ పురుషోత్తం పిచ్చుకల గూళ్లు, వాటి పరిరక్షణ, వాటర్ ఫీడర్ల తయారీపై అవగాహన కల్పించారు. జూపార్క్ ఎడ్యుకేటర్ దీపక్ తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యానికి పెద్దపీట

భాకరాపేట : రాష్ట్ర ప్రభుత్వం పశు వైద్యానికి పెద్దపీట వేస్తోందని సీడీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, చిన్నగొట్టిగల్లు ఎంపీపీ యుగంధర్‌రెడ్డి తెలిపా రు. చిన్నగొట్టిగల్లు పశు వైద్యశాల వద్ద సోమవారం డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రైతుల ఇంటి వద్దకే వచ్చి పశువులకు వైద్యం అందించేందుకు సంచార పశు ఆరోగ్య సేవా వాహనాన్ని జగనన్న ఏర్పాటు చేశారని వివరించారు. ఈ వాహనం చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల రైతులకు అందుబాటులో ఉంటుందని చిన్నగొట్టిగల్లు పశు వైద్యశాల ఉప సంచాలకులు ఆవుల ప్రసాద్ తెలిపారు. జెడ్పీటీసీ స్వరూప, సర్పంచ్ మనోహర్ పాల్గొన్నారు.

మెకానిక్‌లకు ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న వరదాంజనేయులు

తిరుపతి కల్చరల్: మెకానిక్‌లకు వృత్తి నైపుణ్యతతో పాటు వృత్తిపరమైన గుర్తింపు కల్పించేందుకు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ వైస్ ప్రిన్సిపాల్ వరదాంజనేయులు తెలిపారు. గాంధీ భవన్‌లో సోమవారం తిరుపతి టూవీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మెకానిక్‌లు, వారి కుటుంబ సభ్యులకు గ్రూపుల వారీగా ఉచితంగా ఫోర్ వీలర్స్, టూ వీలర్స్ వెహికల్స్, పిట్టర్, ఎలక్ట్రికల్ విభాగాల్లో మూడు నెలలు ఉచితంగా శిక్షణ కల్పిస్తామని తెలిపారు. టెన్త్ ఉత్తీర్ణతతో పాటు టెన్త్ ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి, ప్రభుత్వ ఐటీఐ కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ ఎం.సెల్వరాజ్, వై.బాలక్రిష్ణ, తిరుపతి టూవీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి, కార్యదర్శి మల్లేశ్వరన్, కోశాధికారి గౌస్‌బాషా పాల్గొన్నారు.

రాగి జావ.. ఆరోగ్యానికి తోవ



- నేటి నుంచి రాగి జావ పంపిణీ ప్రారంభం
- పిల్లలకు మెరుగైన విద్య, ఆరోగ్యం అందించమే లక్ష్యంగా చర్యలు

తిరుపతి ఎడ్యుకేషన్ : విద్యతోనే పేదల భవిష్యత్ బంగారుమయం అవుతుంది. ఈ విషయాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారు. నాడు–నేడులో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారు. పలు పథకాలు అమలుచేస్తూ ప్రభుత్వ విద్యారంగానికి పూర్వ వైభవం తీసుకొచ్చారు. విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్యానికి పెద్ద పీట వేశారు. జగనన్న గోరుముద్ద పేరుతో పిల్లలకు రుచి, శుచితో కూడిన పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. ఇంకో అడుగు ముందుకేసి మరింత పోషకాహారాన్ని అందించేందుకు రాగి జావ పంపిణీ పథకాన్ని మంగళవారం నుంచి అందించనున్నారు.

తిరుపతి అర్బన్ మండలంలోని పాఠశాలలు..

మున్సిపల్, మండల పరిషత్, ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలు	-	48
మున్సిపల్, మండల పరిషత్, ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలలు	-	09
ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలు	-	20
మొత్తం పాఠశాలలు	-	77
విద్యార్థులు...		
మున్సిపల్, మండల పరిషత్, ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలు	-	4,885 మంది
మున్సిపల్, మండల పరిషత్, ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలలు	-	1,274 మంది
ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలు	-	9,177 మంది
మొత్తం విద్యార్థులు	-	15,336 మంది

వారానికి మూడు రోజులు

మధ్యాహ్న భోజనంలో పిల్లలకు బలవర్థక ఆహారంతో పాటు వారంలో ఐదు రోజులు ఉడికించిన కోడి గుడ్లు, చిక్కీలు ఇస్తున్నారు. కొత్తగా వారంలో మూడు రోజులు రాగి జావను అందించనుంది. ఒక్కో విద్యార్థికి 10 గ్రాముల రాగిపిండి, 10 గ్రాముల బెల్లం, 150 మి.లీల నీటితో తయారుచేసిన రాగి జావను అందజేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని మంగళవారం ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు.

ఆరోగ్యానికి పెద్ద పీట



విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే కాకుండా వారి ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. ఇప్పటికే పిల్లలకు పౌష్టికాహారం అందిస్తోంది. మరింత బలవర్థక ఆహారం అందించాలన్న సత్సంకల్పంతో రాగి జావను పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని మంగళవారం తిరుపతి అర్బన్‌లోని అన్ని పాఠశాలల్లో ప్రారంభించనున్నాం - ప్రభాకర్‌రాజు, ఎంఈఓ, తిరుపతి అర్బన్

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు



ప్రజలకు జగనన్న సంక్షేమ పథకాలను వివరిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ అందుతున్నాయని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం కార్పొరేటర్ ఆదం రాధాకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు ఆదం సాయికృష్ణారెడ్డితో కలిసి 1వ డివిజన్‌లోని రెడ్డిగుంట ప్రాంతంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారు పొందిన ప్రభుత్వ పథకాలు, లబ్ధిని వివరించారు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, తమ్ముడు గణేష్, మునిరామిరెడ్డి, హనుమంత్‌నాయక్, నాయకులు ఆదం సుధాకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, తిరుమలరెడ్డి, శివయాదవ్, చెంగ్రాయులు, ఇమ్రాన్, చైతన్యయాదవ్, నాదముని, ధనశేఖర్, కోదండ, సదాశివం, వెంకటముని పాల్గొన్నారు.

పేదలకు సూపర్‌స్పెషాలిటీ వైద్యం

- వైద్యరంగం మరింత బలోపేతం
- 83 పీజీ సీట్లు రావడం సంతోషకరం
- రుయా పర్యవేక్షణకు పటిష్ట వ్యవస్థ
- డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ వినోద్‌కుమార్

తిరుపతి తుడా: 'రుయా ఆస్పత్రిని మరింత బలోపేతం చేస్తాం. అన్ని విభాగాలు అందుబాటులోకి తీసుకువస్తాం, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అక్రమాలు, అవినీతికి పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. తప్పు చేయాలంటే భయపడే పరిస్థితిని తీసుకువస్తాం . సీసీ కెమెరాల ద్వారా సరికొత్త సాఫ్ట్ వేర్‌తో పర్యవేక్షణ ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా 16 జీజీహెచ్ ఆస్పత్రుల్లో మెగా వ్యవస్థను పటిష్టం చేస్తాం' అని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల, ప్రభుత్వ ప్రసూతి, రుయా ఆస్పత్రులను ఆయన సోమవారం పర్యవేక్షించారు. 'సాక్షి'తో మాట్లాడారు.

వైద్య విద్య బలోపేతం

వైద్య విద్యను బలోపేతం చేసే దిశగా నిర్ణయాలు తీసుకున్నాం. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి సమస్యలు తెలుసుకున్నాం. హాస్టళ్ల అభివృద్ధికి ఆదేశాలు జారీచేశాం. ఆస్పత్రికి వచ్చే అరుదైన వ్యాధులను గుర్తించి మరింత అధ్యయనం చేసే దిశగా వైద్య విద్యార్థులకు ఆదేశాలు ఇచ్చాం. విద్యార్థుల విజ్ఞప్తి మేరకు వసతులు పెంచేందుకు సీడీఎస్ నిధుల నుంచి రూ.కోటి మంజూరు చేశాం.

అన్ని విభాగాలు తీసుకువస్తాం

రుయాలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు తీసుకువచ్చే దిశగా చర్యలు చేపట్టాం. రేడియాలజీ విభాగంలోనూ పీజీ విద్య అందుబాటులోకి రానుంది. కార్డియాలజీ విభాగం ఏర్పాటు చేస్తాం. ఇప్పటికే పదోన్నతులు, ఖాళీల భర్తీలని పూర్తిచేశాం. ప్రతి వైద్యుడు నాడి పట్టాల్సిందే. ప్రైవేట్ ప్రాక్టీస్‌పై ఫిర్యాదులు వస్తున్నాయి.

83 పీజీ సీట్లు మంజూరు

ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా 631 పీజీ వైద్యవిద్య సీట్లు మంజూరు కావడం సంతోషం. ఎస్వీ మెడికల్ కళాశాలకు 83 పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఒక్కో విద్యార్థిపై రూ.1.2 కోట్లు మంజూరైంది. ఆ నిధులతో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, విద్యార్థులకు సౌకర్యాలను సమకూర్చేందుకు ఖర్చు చేస్తాం.

తప్పు చేసిన వారిని ఉపేక్షించం



రుయా ఆస్పత్రిలో ఇటీవల ఆరోగ్యశ్రీ ఆసరా నిధుల గోల్‌మాల్, సంతకాల ఫోర్జరీ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్నాం. తప్పు చేసినవారిపై కఠిన చర్యలు తప్పవు. అధికారుల నిర్లక్ష్యాన్ని సహించే ప్రసక్తే లేదు. డాక్టర్ వినోద్‌కుమార్, రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్

బస్టాండ్‌లో ప్లాట్‌ఫాం నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పాకాల : స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్లాట్‌ఫాం నిర్మాణానికి సోమవారం తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ పాకాల బస్టాండ్‌లో ప్లాట్‌ఫాం లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షా కాలంలో గుంతల్లో నీరు నిలిచి బస్సులు ఎక్కేటప్పుడు సమస్యగా మారుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సుమారు రూ.43 లక్షలతో సిమెంట్ ప్లాట్‌ఫాం నిర్మిస్తున్నట్టు చెప్పారు. గత ప్రభుత్వాలు ఎన్నిసార్లు హామీ ఇచ్చినా మాటలకే పరిమితమయ్యాయని, ఇచ్చిన మాటను నిలబెట్టుకుంది వైఎస్సార్ సీపీ నేనని గుర్తు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, ఎంపీపీ లోకనాథం, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, నాయకులు నంగా బాబురెడ్డి, మునీశ్వర్‌రెడ్డి, రఘు, మునీర్, హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల సంక్షేమమే ధ్యేయం

భాకరాపేట: రాష్ట్ర ప్రభుత్వం తల్లీబిడ్డ సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ యుగంధర్‌రెడ్డి తెలిపారు. చిన్నగొట్టిగల్లులో సోమవారం పోషణ పక్వాడ వారోత్సవాల్లో భాగంగా సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, బాలింతలకు పోషకాహారాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. సీడీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, జెడ్పీటీసీ స్వరూప, ఎంపీడీవో దేవేంద్రబాబు, తహసీల్దార్ హనుమాన్‌నాయక్, సీడీపీవో రాజమ్మ పాల్గొన్నారు.

రేపటి నుంచి అక్షర తోరణం

తిరుపతి కల్చరల్: తెలుగు భాష, వెయ్యేళ్ల తెలుగు సాహిత్య విశిష్టతను చాటుతూ ఉగాది (బుధవారం) నుంచి 365 రోజులు జూమ్‌లో అక్షర తోరణం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలుగు భాష, సాహితీ, సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల సుబ్బానాయుడు తెలిపారు. ఆయన సోమవారం ప్రెస్‌క్లబ్‌లో అక్షర తోరణం కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఐడీ 8333867666, పాస్ కోడ్:reva సేవ ఆన్‌లైన్ యూ ట్యూబ్, సేవ ఫేస్‌బుక్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తామన్నారు. శుభకృతుకు వీడ్కోలు శోభకృతుకు స్వాగతం చెబుతూ అక్షర తోరణం కార్యక్రమాన్ని విజయవాడలో మండలి బుద్ధప్రసాద్ మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు.

శిల్పకళాశాల ప్రాంగణంలో ఎంపోరియం

తిరుపతి అలిపిరి: శిల్పకళాశాలలో ఉన్న ఉత్పత్తులను భక్తులకు అందుబాటులోకి తీసుకురావడానికి ఎంపోరియంను ఏర్పాటు చేయనున్నట్టు టీటీడీ జేఈవో సదాభార్గవి తెలిపారు. ఆమె సోమవారం టీటీడీ శిల్ప కళాశాలను సందర్శించారు. ఒడిశా, కృష్ణా జిల్లా పెడన ప్రాంతాలకు వెళ్లి శిక్షణ పొందిన విద్యార్థులను అభినందించారు. ఆర్ట్ గ్యాలరీని సందర్శించారు. సీఈ నాగేశ్వరరావు, ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ, ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఈవో భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

జువైనల్ హోమ్ పరిశీలన



తిరుపతి లీగల్ : తిరుపతి మంగళంలోని జువైనల్ హోమ్‌ను సోమవారం తిరుపతి ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరిత పరిశీలించారు. అక్కడ బాలురకు అందుతున్న ఆహారం, ఇతర విషయాలను తనిఖీ చేశారు.

వైద్య విద్యార్థులు పరిశోధనలపై దృష్టిసారించాలి



డీఎంఈని సత్కరిస్తున్న ఉద్యోగ సంఘం నేతలు

తిరుపతి తుడా : వైద్య విద్యార్థులు పరిశోధనలపై దృష్టిసారించి సమాజ ఉన్నతికి దోహదపడాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ వినోద్‌కుమార్ సూచించారు. ఎస్వీ మెడికల్ కళాశాల క్రీడా మైదానంలో చేపట్టిన వైద్య విద్యార్థుల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఇందులో మెడికల్ కళాశాలల నుంచి 35 టీమ్‌లు పాల్గొంటున్నాయి. అనంతరం అధికారులతో కలిసి ఎస్వీమెడికల్ కళాశాల, ప్రభుత్వ ప్రసూతి, రుయా ఆస్పత్రులను తనిఖీ చేశారు. ఆయనను ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కో చైర్మన్ రాజా, ఇతర ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగులు సత్కరించి శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు రాధాకృష్ణ, మహేంద్ర సమస్యలపై వినతి పత్రం అందజేశారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, రుయా, మెటర్నటీ సూపరింటెండెంట్ మునీంద్రుడు, పార్థసారథిరెడ్డి, సీఎస్ఆర్ఎంవో లక్ష్మానాయక్, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో ఇబి దేవి, అసిస్టెంట్ ఆర్ఎంవో యువ అన్వేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా రవాణాకు ఇబ్బంది కలిగించొద్దు

తిరుపతి తుడా: ప్రజా రవాణాకు ఇబ్బంది కలిగించేలా ఏ ఒక్కరూ వ్యవహరించవద్దని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. వ్యాపార సముదాయాల వద్ద రోడ్లు, ఫుట్ పాత్ ఆక్రమణలు, తోపుడుబండ్లతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఆమె సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులపై అధికారులతో సమీక్షించారు. ఫుట్‌పాత్‌లు, రోడ్ల ఆక్రమణలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. వాటి తొలగింపునకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, ఎస్ఈ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, మున్సిపల్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య కీర్తనలతో ఆధ్యాత్మిక చైతన్యం

తిరుపతి కల్చరల్: అన్నమయ్య కీర్తనలతో సమాజంలో విలువలు పెరగడంతోపాటు ప్రజల్లో చైతన్యం కలుగుతుందని పద్మావతి మహిళా వర్సిటీ ఆచార్యులు కొలకలూరి మధుజ్యోతి తెలిపారు. అన్నమయ్య 520వ వర్ధంతి ఉత్సవాల్లో భాగంగా అన్నమాచార్య కళామందిరంలో సోమవారమూ సాహిత్య సదస్సు నిర్వహించారు. ఆమె అన్నమయ్య- సామాజికత అనే అంశంపై ఉపన్యసించారు. పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ విశ్రాంత ఉపకులపతి అనుమాండ్ల భూమయ్య అన్నమయ్య కీర్తనలలో భావసౌధారం అనే అంశంపై ప్రసంగించారు. సప్తగిరి ఉప సంపాదకుడు నొస్సం నరసింహాచార్యులు అన్నమయ్య -నరసింహ కీర్తనలు అనే అంశంపై ప్రసగించారు. అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ విభీషణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

దళిత ద్రోహి చంద్రబాబు



నిరసన తెలుపుతున్న జేసీఎస్ అధ్యక్షులు బాలిశెట్టి కిషోర్, భూమన అభినయ్‌రెడ్డి తదితరులు

తిరుపతి మంగళం : దళితుల్లో ఎవ్వరైనా పుట్టాలనుకుంటారా అని కించపరిచిన దళిత ద్రోహి చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ యూత్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు అజయ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన సోమవారం అసెంబ్లీలో దళిత ఎమ్మెల్యే సుధాకర్‌బాబుపై టీడీపీ నాయకులు చేసిన దాడిని ఖండించారు. ఈ సందర్భంగా మంగళం రోడ్డులో ఫ్లెక్సీలతో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ దళిత ఎమ్మెల్యేపై దాడి చేయించడం చంద్రబాబు నీచ రాజకీయాలకు నిదర్శనమన్నారు.

ఎమ్మెల్యేపై దాడి తగదు

అసెంబ్లీ సమావేశాలలో సంతనూతలపాడు ఎమ్మెల్యే సుధాకర్ బాబుపై దాడి దారుణమని జేసీఎస్ అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్ తెలిపారు. ఆయన సోమవారం డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఫ్లెక్సీలు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సోషల్ మీడియా జిల్లా కో కన్వీనర్లు మైలాం శ్రీకాంత్ రెడ్డి, వేలూరు రాకేష్, తిరుపతి పట్టణ సోషల్ మీడియా కో కన్వీనర్లు ముఖేష్, సూరి, కొఠారి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఉచితంగా ఆధార్ అప్‌డేషన్

తిరుపతి రూరల్: దశాబ్దం క్రితం తీసుకున్న ఆధార్ కార్డులో వివరాలను సరిచేసుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తోంది. మార్చి 15 నుంచి జూన్ 14 వరకు ఆధార్ డాక్యుమెంట్ల వెరిఫికేషన్‌ను ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా చేసుకోవచ్చు. అందుకోసం తిరుపతి రూరల్ మండలంలో తుమ్మలగుంట, అవిలాల, చిగురువాడ, తిరుచానూరు పంచాయతీల్లో సోమవారం ప్రత్యేక కేంద్రాలు ప్రారంభించారు. జిల్లాల పునర్విభజన జరగక ముందు ఉమ్మడి చిత్తూరు జిల్లాగా ఆధార్ కార్డుల్లో నమోదు అయి ఉంది. ప్రస్తుతం జిల్లాల విభజన జరగడంతో తిరుపతి జిల్లాగా నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటనారాయణ కోరారు. ఆయన సోమవారం తుమ్మలగుంటలోని ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని సందర్శించారు. ఆధార్ డాక్యుమెంట్ అప్‌డేట్ కోసం GSWSHelper/Aadar Document Update అని గుగూల్‌లో సెర్చ్ చేయాలని సూచించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని సోమవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దిరెడ్డి, సినీ నటులు మంచు విష్ణు, విశ్వక్సేన్ దర్శించుకున్నారు. వారికి అధికా రులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. సినీ నటులను చూడడానికి అభిమానులు ఉత్సాహం చూపారు.

మామిడిలో సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖ అధికారిణి శైలజ

చంద్రగిరి: మామిడిలో సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడి సాధించవ్చని మండల ఉద్యానశాఖ అధికారిణి శైలజ తెలిపారు. ఆమె సోమవారం పాకాల, చంద్రగిరి మండలాల్లోని పలు గ్రామాల్లోని మామిడి తోటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మామిడికాయ బఠాణి గింజ, ఉసిరికాయ, నిమ్మకాయ పరిమాణంలో ఉన్నట్టు తెలిపారు. ఈ దశలలో తామర పురుగు, తేనెమంచు పురుగు ఆశించే అవకాశం ఉందని పేర్కొన్నారు. కొమ్మ కత్తిరింపులు సరిగ్గా చేయని తోటల్లో ఈ పురుగుల ఉధృతి అధికంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. అనంతరం పురుగు మందుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, మందులను గురించి వివరించారు. ఏ.రంగంపేట, భీమవరం ఉద్యాన, వ్యవసాయ రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

డీఎస్ఐఆర్-పీఆర్ఐఎస్ఎం పథకంపై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో మహిళా వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ కె.రాజారెడ్డి తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : పద్మావతి మహిళా వర్సిటీలో ఐదేళ్ల డీఎస్ఐఆర్-పీఆర్ఐఎస్ఎం పథకానికి సంబంధించిన అధ్యయన నివేదికపై సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. డీఎస్ఐఆర్ మెంబర్ సెక్రటరీ రామానుజ్ బెనర్జీ పీఆర్ఐఎంఎం లక్ష్యాలను వివరించారు. డీఎస్ఐఆర్ హెడ్ పీకే దత్తా, ఇన్‌చార్జ్ వీసీ కె.రాజారెడ్డి, రిజిస్ట్రార్ రజని, ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ పి.ఉమామహేశ్వరిదేవి, కో ఇన్వెస్టిగేటర్ పి.విజయలక్ష్మి, పి.జ్యోత్స్న పాల్గొన్నారు.

10 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : మద్యం తాగి వాహనాల్లో తిరుమలకు వెళుతున్న పది మందికి రూ.20 వేలు జరిమానా విధిస్తూ తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు సోమవారం తీర్పు చెప్పారు. తిరుమల ట్రాఫిక్ పోలీసులు తిరుమల జీఎన్‌సీ టోల్‌గేట్ వద్ద తనిఖీలు చేపట్టి పది మందిపై కేసులు నమోదు చేశారు.

మేలైన సాగు పద్ధతులపై శిక్షణ

ఎర్రావారిపాళెం: మేలైన పంట సాగు పద్ధతులపై జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసులు రైతులకు శిక్షణ ఇచ్చారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను పాటించడం ద్వారా కలిగే లాభాలను వివరించారు. చిరుధాన్యాల సాగుతో రైతుకు ఆర్థికాభివృద్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారిణి సుధ, మండల వ్యవసాయ అధికారి ఖాదర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

నేడు నామినేషన్ల స్వీకరణ

తిరుపతి లీగల్ : ఈ నెల 31వ తేదీన జరగనున్న తిరుపతి న్యాయవాదుల సంఘం కార్యవర్గ పదవుల ఎన్నికలకు మంగళవారం నామినేషన్లు స్వీకరించనున్నట్టు ఎన్నికల అధికారి గజేంద్ర తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి నామినేషన్లు స్వీకరిస్తామన్నారు.

కౌన్సిలింగ్‌తో దాంపత్య సమస్యలకు చెక్

తిరుపతి కల్చరల్: దంపతుల మధ్య తలెత్తే సమస్యలు, కుటుంబ కలహాలకు కౌన్సిలింగ్‌తో స్వస్తి చెప్పవచ్చని రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం తెలిపారు. రాస్ కార్యాలయంలో సోమవారం రాస్ కుటుంబ సలహా కేంద్రం సబ్ కమిటీ సమావేశంలో ఆయన మార్గనిర్దేశం చేశారు. ప్రాజెక్టు డైరెక్టర్ వి.నాగరాజు, ఎన్‌బీ.సుధాకర్‌రెడ్డి, సామాజిక కార్యకర్త వీఎస్.రంగనాథం, రాస్ చైల్డ్ లైన్ సమన్వయ కర్త కె.నాగరాణి, ప్రత్యేక విద్యా కేంద్రం ప్రిన్సిపాల్ వి.నందిని, రాస్ కౌన్సిలర్లు సి.బాలాజీరెడ్డి, కవిత, అంకంనాయుడు పాల్గొన్నారు.

హెల్మెట్ భారం కాదు.. భరోసా

తిరుపతి తుడా : హెల్మెట్ ధరించాన్ని భారంగా భావించవద్దని, అది జీవితానికి భరోసా అన్న విషయాన్ని గుర్తించాలని స్విమ్స్ డైరెక్టర్ వెంగమ్మ, ట్రాఫిక్ డీఎస్పీ కాటమరాజు తెలిపారు. స్విమ్స్ న్యూరో సర్జరీ, ఫిజియోథెరపీ ఆధ్వర్యంలో సోమవారం వరల్డ్ హెడ్ ఇన్‌జూర్ అవేర్నెస్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు తలకు గాయాలై కోమాలోకి వెళుతున్నారని తెలిపారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ మధ్య జరిగిన ప్రమాదాల్లో హెల్మెట్ లేనివే ఉన్నాయన్నారు.

పేదలకు అల్పాహారం



పేదలకు అల్పాహారం వితరణ చేస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి స్మార్ట్ సిటీ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి వద్ద రోగులు, వారి సహాయకులు 450 మందికి ఉచితంగా అల్పాహారాన్ని అందజేశారు. లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ ఎం.భాస్కర్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలో ఆరు నెలలుగా అన్నదానం చేస్తున్నామని తెలిపారు. ఇందుకు బాబాస్ బేకరి శ్రీహరి సహకారం అందించడం సంతోషకరమని తెలిపారు. ప్రతినిధులు చక్రధర్, శరత్, శ్రీహరి, శంకర్, ఈశ్వరయ్య, మోహన్, శీను, సభ్యులు పాల్గొన్నారు.